సాక్షి
మంచిర్యాల

సోమవారం, 25, మార్చి, 2024



ఉద్యోగార్థులపై ఫీజుల భారం!

నిరుద్యోగులకు పోస్టుల దరఖాస్తు ఫీజులు పెను భారంగా మారుతున్నాయి. ఇప్పటికే డీఎస్సీ ఫీజు రూ.1000 నిర్ణయించగా తాజాగా టెట్ ఫీజు కూడా రూ.1000గా నిర్ణయించారు. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ : 6:29	మంగళ : 4:53

గరిష్టం/కనిష్టం
38.4 /26.6

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పడప్పడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉదయం 10 గంటల నుంచే వేడి అధికంగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

మందమర్రిలో సీఆర్‌పీఎఫ్ బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు

మందమర్రిరూరల్: వచ్చే లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ కోరారు. మందమర్రి పట్టణంలో సీఆర్‌పీఎఫ్ బలగాలతో కలిసి ఆదివారం కవాతు నిర్వహించారు. పట్టణంలోని పాలచెట్టు ఏరియా నుంచి మొదటి, రెండవ, మూడవ జోన్‌లు, మార్కెట్ ఏరియా గుండా సాగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే ఊరుకోబోమని హెచ్చరించారు. నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా, ఒత్తిడికి పాల్పడినా కేసులు తప్పవన్నారు. కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, సర్కిల్ పరిధిలోని ఎస్సైలు రాజశేఖర్, ఆంజనేయులు, ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

కళావేదిక నిర్మించాలి



మాట్లాడుతున్న కవి మలయశ్రీ

మంచిర్యాలఅర్బన్: సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు కళావేదిక నిర్మించాలని కవి మలయశ్రీ ప్రభుత్వానికి సూచించారు. ఆదివారం స్థానిక సరస్వతీ శిశుమందిర్‌లో జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. సంస్థ ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బెల్లాల సుగుణాకర్, సంతోష్, సత్తయ్య కవితలు వినిపించారు.

పెట్రోల్ బంకులో ఉద్యోగాలకు ఇంటర్వ్యూ



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఏఆర్ ఏసీపీ సురేంద్ర

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులో పని చేయడానికి ఆదివారం నిర్వహించిన ఇంటర్వ్యూకు అనూహ్య స్పందన లభించింది. పెట్రోల్ బంకులో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు ఈనెల 19న ఉద్యోగ పెట్రోల్ ఫిల్లింగ్‌కు 15 మంది, ఎయిర్ ఫిల్లింగ్ ఇద్దరు, స్కావెంజర్‌కు ఒకరు కావాలని నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ మేరకు అర్హులైన, ఆసక్తి ఉన్న స్త్రీలు 15 మంది, పురుషులు 25 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఏఆర్ ఏసీపీ సురేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం ఇంటర్వ్యూ నిర్వహించారు. ఇంటర్వ్యూకు వచ్చిన వారి అర్హత ఆధారంగా ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. ఈ నెలాఖరున బంకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఏఆర్ ఆర్ఐ వామనమూర్తి, ఆర్ఐ ఎం.శ్రీనివాస్, సంపత్, ఏఆర్ ఎస్ఐ వెంకటేశ్ పాల్గొన్నారు.

పెళ్లి కావడం లేదని యువతి ఆత్మహత్య



గ్రీష్మసాయి(ఫైల్)

మంచిర్యాలక్రైం: పెళ్లి సంబంధం కుదరడం లేదని, తనకు ఇక పెళ్లి కాదని మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగింది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన మలిశెట్టి శ్రీనివాస్ కూతురు గ్రీష్మసాయి(25) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో పీజీ చదువుతోంది. గ్రీష్మకు నాలుగేళ్లుగా వారి కులదైవం రాజరాజేశ్వరస్వామి పేరుతో పూనకం వస్తోంది. ఈ కారణంగా పెళ్లి సంబంధాలు కుదరడం లేదు. పూనకం వస్తుందన్న కారణంతో పెళ్లి చేసుకోవడానికి నిరాకరిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల గ్రీష్మసాయి సెలవులపై ఇంటికి వచ్చింది. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుంది. బయటికు వెళ్లిన కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ ఉండడంతో వెంటనే కిందకు దించి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆస్పత్రిలో ఉక్కపోత?



ఐసీయూలో చికిత్స పొందుతున్న రోగి వద్ద ఇంటి నుంచి తెచ్చుకున్న ఫ్యాన్



పలు వార్డుల్లో పనిచేయని ఫ్యాన్లు



జీజీహెచ్ ఐసీయూలో పనిచేయని ఏసీలు

- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- జీజీహెచ్‌లో పనిచేయని ఏసీలు, పాడైన ఫ్యాన్లు
- ఇళ్ల నుంచి ఫ్యాన్లు తెచ్చుకుంటున్న రోగులు

మంచిర్యాలటౌన్: రోజురోజుకూ జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇక మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)లోని రోగులు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. ఐసీయూలో ఏసీలు, వార్డుల్లో ఫ్యాన్లు పని చేయడం లేదు. ఉక్కపోత భరించలేక కొందరు రోగులు ఇంటి నుంచే ఫ్యాన్లు తెచ్చుకుని బెడ్ వద్ద ఏర్పాటు చేసుకుంటున్నారు. వేసవి ప్రారంభానికి ముందే ఆస్పత్రిలో ఏసీలు, ఫ్యాన్లు పనిచేసేలా చూడాల్సిన అధికారులు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నా వాటిని పట్టించుకోవడం లేదు. దీంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఉక్కపోత కష్టాలు తప్పడం లేదు.

ఏటా ఇవే తిప్పలు..

మంచిర్యాల జీజీహెచ్‌లోని ఐసీయూలో 9 బెడ్‌లు ఉండగా, ఐదు ఏసీలు ఉన్నాయి. అందులో మూడు ఏసీలు ప్రస్తుతం పనిచేయడం లేదు. 9 బెడ్‌లలో రోగులు చికిత్స పొందుతుండగా, ఏసీలు పనిచేయక పోవడంతో ఇంటి నుంచి తెచ్చిన ఫ్యాన్లు వినియోగిస్తున్నారు. ఐసీయూలో పనిచేసే సిబ్బంది సైతం టేబుల్ ఫ్యాన్‌ను వినియోగించాల్సిన పరిస్థితి. వివిధ వార్డుల్లోనూ కొన్ని ఫ్యాన్లు పనిచేయడంలేదు. రోగులు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని వార్డుల్లో ఫ్యాన్లు సరిపోకపోవడంతో, ఇంటి నుంచి కూలర్లు తెచ్చుకుంటున్నా రు. జీజీహెచ్, ఎంసీహెచ్‌కు ఓపీకి వస్తున్న రోగులు వేచి ఉండే వార్డుల్లో ఫ్యాన్లు లేకపోవడంతో వారికీ ఉక్కపోత తప్పడం లేదు. ఏటా వేసవి మొదలు కాగానే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు ఉక్కపోత ఇబ్బందులు తప్పడం లేదు. వేసవికి ముందే ఏసీలు, ఫ్యాన్లకు మరమ్మతులు చేయించాల్సి ఉన్నా, ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

సిబ్బందిని కేటాయిస్తేనే...

జీజీహెచ్‌లో పనిచేసేందుకు ఒక ఎలక్ట్రీషియన్ ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తుండగా, ఏసీలకు మరమ్మతులు చేపట్టేందుకు సిబ్బంది నియామకం చేపట్టలేదు. జీజీహెచ్‌లో 52 ఏసీలు ఉండగా, ఎంసీహెచ్‌లో 30కి పైగా ఏసీలు ఉన్నాయి. వీటికి ఏటా సర్వీసింగ్‌తోపాటు, మరమ్మతులు చేసేందుకు కనీసం ఒక టెక్నీషియన్‌ను నియమించాల్సి ఉంది. చిన్నపాటి మరమ్మతులకు సైతం బయటి టెక్నీషియన్లను తీసుకువస్తే వేల రూపాయలు చెల్లించాల్సి ఉండడంతోపాటు సమయానికి మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఔట్‌సోర్సింగ్ విధానంలో ఎలక్ట్రీషియన్ ఒకరు పనిచేస్తున్నా ఈ నెలాఖరు వరకు మాత్రమే వారికి పనిచేసేందుకు అవకాశం ఉంది. ఆ తరువాత వారిని టర్మినేట్ చేసేలా ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ప్రస్తుతం జీజీహెచ్, ఎంసీహెచ్‌లకు ఒక ఏసీ టెక్నీషియన్, ఒక ఎలక్ట్రీషియన్ నియామకం చేపడితేనే మరమ్మతులు వెనువెంటనే చేసే అవకాశం ఉంది.

మరమ్మతులు చేయిస్తాం



మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని ఏసీలకు మరమ్మతులు చేయాల్సి ఉంది. జీజీహెచ్‌లోని ఐసీయూలోనూ ఏసీలకూ మరమ్మతులు చేయాల్సి ఉంది. బయటి టెక్నీషియన్లను సంప్రదిస్తున్నాం. ఆసుపత్రికే రెగ్యులర్‌గా ఒక టెక్నీషియన్ ఉంటే ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసే అవకాశం ఉంటుంది. అందుకే నూతనంగా ఏసీ టెక్నీషియన్, మరో ఎలక్ట్రీషియన్‌ను నియమించేందుకు ప్రయత్నిస్తున్నాం.

– డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్

దేశ భక్తికి వందనం



బెల్లంపల్లి మున్సిపాలిటీలో నిత్య జనగణమన గీతాలాపన కార్యక్రమం జరుగుతోంది. ఉదయం 8 గంటలకు మైక్ ద్వారా జనగణమన గీతం వస్తుంది. అందరికీ వినిపించేలా పట్టణంలో మైకులు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 8 గంటలకు జాతీయ గీతం ప్రారంభం కాగా, కాంటా చౌరస్తాలో భిక్షాటనకు తన దివ్యాంగుడైన కొడుకుతో వచ్చిన మహిళ సెల్యూట్ చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఎంతోమందికి వీరు స్ఫూర్తిగా నిలిచారు.- (బెల్లంపల్లి)

కూలీలకు అందని వేతనాలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

'ఎర్రటి ఎండలో కాయకష్టం చేస్తున్నాం. చేసిన పనికి నెలలుగా కూలి డబ్బులు వస్తలేవు. పని చేస్తే వారానికి కూలి వస్తదని ఆశతో పనులు చేస్తున్నాం. కానీ మూడు నెలల సంది పైసలు చేతికి అందుత లేవు. తిండికి తిప్పలు పడుతున్నాం. మా కూలి డబ్బులు ఇప్పించాలె' ఇదీ లక్సెట్టిపేట మండలం జెండా వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళా కూలీ ఆవేదన. జిల్లాలో ఉపాధి పనులకు హాజరవుతున్న కూలీలందరిదీ ఇదే పరిస్థితి.

- మూడు నెలలుగా చెల్లించని వైనం
- ఇబ్బంది పడుతున్న ఉపాధి కూలీలు

పాతమంచిర్యాల: గ్రామాల్లో వలసలు నివారించి ప్రజలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో కేంద్రం ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు సక్రమంగా కూలి డబ్బులు అందడం లేదు. పనులు చేసిన వారానికి వేతనం అందాల్సి ఉండగా, రెండు నెలలు గడిచినా కూలి చేతికందడం లేదు, దీంతో చాలా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు 4 గంటలు పని చేస్తే కేవలం రూ.250 కూలి మాత్రమే అందుతుందని తెలిపారు. ఉదయం, సాయంత్రం పనుల ప్రారంభానికి ముందు, పనులు ముగింపు సమయంలో ఫొటోలు దిగి అధికారులు సూచించిన కొలతల ప్రకారం పనులు చేస్తున్నామంటున్నారు. పని స్థలాల్లో వసతులు కల్పించకున్నా పనులు చేస్తుంటే కూలి సరైన సమయానికి రాక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో జాబ్‌కార్డులు	1,20,502,
మొత్తం కూలీలు	2,35,764,
కూలీ కుటుంబాలు	55,822,
పనులకు హాజరయ్యే కూలీలు	88,033

నెలాఖరు వరకు వేతనాలు..

ఉపాధి కూలీలకు వేతనాలు ఈ మార్చి నెలాఖరు వరకు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. డిసెంబర్ నెలకు సంబంధించిన వేతనాలు జనవరిలో కూలీల ఖాతాల్లో జమ చేశాం. జనవరి నుంచి మార్చి వరకు రావాల్సిన వేతనాలు మార్చి నెలాఖరు వరకు చెల్లిస్తాం, పని స్థలాల్లో నీడ కోసం ప్రభుత్వం నుంచి టెంట్లు రాలేదు. ప్రతినెలా నివేదికలు పంపుతున్నాం. ఎండాకాలంలో కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తాం.

– కిషన్, డీఆర్డీవో

వసతులు లేకున్నా పనులు..

గతంలో ప్రభుత్వం ఉపాధిహామీ పనులు చేసే కూలీలు పని స్థలాల్లో కాసేపు సేదతీరడానికి టెంట్ సౌకర్యం కల్పించేది. పని స్థలాలలో మెడికల్ కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచేవారు. రెండుమూడేళ్లుగా ఎలాంటి వసతులు కల్పించడం లేదు. చెట్ల నీడనే ఆశ్రయించాల్సి వస్తుందని కూలీలు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి కూలీలకు సక్రమంగా వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కళ తప్పుతున్న కార్మిక క్షేత్రం



త్వరలో మూతపడనున్న ఆర్కే ఓసీ

- ఆరు దశాబ్దాలుగా బొగ్గు గనులకు నిలయం
- నేడు అన్ని గనులు, కార్యాలయాలు మూసివేత
- ఉన్న ఒక్క ఓసీపీ జీవితకాలం ఇంకా 8 నెలలే
- పట్టణ అస్తిత్వం అగమ్య గోచరం



రామకృష్ణాపూర్‌లోని ప్రధాన చౌరస్తా..

రామకృష్ణాపూర్: ఒకప్పుడు భూగర్భ బొగ్గు గనులు, ఏరియా జీఎం కార్యాలయం, డిపార్ట్‌మెంట్లతో కళకళలాడిన కార్మికక్షేత్రం రామకృష్ణాపూర్. సింగరేణి తల్లిని నమ్ముకుని ఉపాధి కోసం వందలాది కుటుంబాలు ఇక్కడికి వచ్చాయి. కార్మికులతోపాటు కార్మికేతల కుటుంబాలు, పాఠశాలలు, వ్యాపార సంస్థలతో ఓ వెలుగు వెలిగింది. పండుగలు, ఉత్సవాల వేళ పట్టణం కార్మిక కుటుంబాలతో కళకళలాడేది. ఐక్యతకు మారుపేరుగా నిలిచింది. మందిరాలు, మసీదులు, చర్చిలతోపాటు అన్నివర్గాల ప్రజలతో మినీ ఇడియాను తలపించిన రామకృష్ణాపూర్ ఉనికే ఇప్పుడు ప్రశ్నార్థకం కాబోతోంది. ఇప్పటికే భూగర్భ గనులు మూతపడగా వందలాది కుటుంబాలు ఊరి విడిచి వెళ్లాయి. ఇక ఉన్న ఒక్క ఓసీపీ(ఉపరితల గని) జీవితకాలం కూడా మరో 8 నెలల్లో ముగియనుంది. దీంతో పట్టణ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారనుంది. కొద్ది రోజుల్లో ఇప్పటికే శోభ కోల్పోయిన గోలేటి, మాదారం పట్టణాల సరసన చేరనుంది.

క్రమంగా మూత పడుతున్న గనులు..

135 ఏళ్ల సింగరేణి చరిత్రలో దాదాపు 60 ఏళ్లకుపైగా రామకృష్ణాపూర్ పదికిపైగా భూగర్భ బొగ్గ గనులు ఉండడంతో కార్మికులు, వారి కుటుంబాలు, కార్మికేతరులతో కళకళలాడింది. రెండు దశాబ్దాలుగా సింగరేణిలో భూగర్భ గనులు మూతపడుతూ వస్తున్నాయి. కార్మిక కుటుంబాలను సంస్థ బదిలీ చేస్తోంది. దీంతో పట్టణం క్రమంగా ఖాళీ అవుతోంది. గతంలో ఇక్కడ ఆర్కే-1, ఆర్కే-1ఏ, ఆర్కే-2, ఆర్కే-3, ఆర్కే-4, ఎంకే-4, 4ఏ భూగర్భ గనులు పనిచేసేవి. దీంతో రామకృష్ణాపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంతోపాటు స్టోర్స్, వర్క్‌షాప్, టింబర్ యార్డు తదితర కార్యాలయాలు ఇక్కడే ఉండేవి. కాలక్రమేనా బొగ్గు నిల్వలు తగ్గిపోయాయని, నిల్వలు ఉన్నా భూగర్భ గనులతో సంస్థకు నష్టం వస్తోందన్న సాకుతో సింగరేణి యాజమాన్యం ఒక్కో గనిని మూసివేస్తూ వచ్చింది. భూగర్భ గనులన్నీ మూతపడడంతో జీఎం ఆఫీసును 20 ఏళ్ల క్రితం ఇక్కడి నుంచి ఎత్తివేశారు. అప్పటి నుండే పట్టణ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. జాతీయ సంఘాల నాయకులు స్థానికంగా ఉన్నా చేష్టలుగడి చూస్తున్నారే తప్ప ఏరియా భవితవ్యాన్ని కాపాడే ప్రయత్నం చేయడం లేదు. గనులు మూతపడి కార్మికుల సంఖ్య తగ్గిపోవడంతో రామకృష్ణాపూర్ ఏరియా కళావిహీనంగా మారింది.

ఇటీవలే ఆర్కే-1ఏ మూసివేత..



మూసివేసిన ఆర్కే-1ఏ గని

సుమారు 35 ఏళ్లపాటు బొగ్గు ఉత్పత్తి చేసిన ఒక్కగానొక్క భూగర్భగని ఆర్కే-1ఏను యాజమాన్యం ఇటీవలే మూసివేసింది. బొగ్గు నిల్వలు ఉన్నప్పటికీ నష్టాలను సాకుగా చూసి గనిని మూసివేశారు. దీంతో ఇక్కడి కార్మికులను యాజమాన్యం బదిలీ చేసింది. తాజాగా ఒక్కగానొక్క ఓసీపీని కూడా మూసివేసేందుకు యత్నిస్తోంది. ఆర్కే ఓసీ భవితవ్యం మరో 8 నెలలే ఉందని అధికారులు చెబుతున్నారు. ఎక్స్‌టెన్షన్ చేసే అవకాశం ఉన్నా.. ఆ దిశగా యాజమాన్యం చర్యలు చేపట్టడం లేద ని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలిసినా కార్మిక సంఘాలు మౌనం వహించడంపై కార్మిక కుటుంబాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఇక్కడ ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు లేకపోవడం కార్మికుల పిల్లలకు సమస్యగా మారింది. ఓసీపీ కూడా మూసివేస్తే రామకృష్ణాపూర్ పట్టణం గతమెంతో ఘనం అన్నట్లుగా మిగిలిపోవడం తప్ప ఏమీ ఉండదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దాహం తీరే దారేది!?

- మండుతున్న ఎండలు
- ఇంకిపోయిన వాగులు
- ఖాళీగా దర్శనమిస్తున్న నీటి తొట్లు
- నీళ్ల కోసం తల్లడిల్లుతున్న వన్యప్రాణులు



చెత్తా చెదారంతో నిండిన నీటితొట్టి



కుక్కల దాడిలో గాయపడిన చుక్కల దుప్పి

కోటపల్లి: వేసవి వచ్చిందంటే చాలు వేటగాళ్ల ఉచ్చుకు వన్యప్రాణులు బలవుతున్నాయి. ఏటా వేసవిలో అడవిలోని వాగులు, వంకలు కుంటలు ఎండిపోతున్నాయి. దీంతో నీటి తావును వెతుక్కుంటూ వెళ్తున్న జంతువులు వేటగాళ్ల ఉచ్చుకు చిక్కుతున్నాయి. అటవి జంతువులు వచ్చే స్థలాలను గుర్తిస్తున్న వేటగాళ్లు ఇదే అదనుగా నీటి గుంతల వద్ద ఎర, ఉచ్చు ఏర్పాటు చేసి కిరాతకంగా హతమారుస్తున్నారు.

దారి తప్పి గ్రామాల్లోకి..

ఇక కొన్ని జంతువులు దాహం తీర్చుకునేందుకు నీటి వనరులను వెతుక్కుంటూ దారి తప్పుతున్నాయి. గ్రామాల శివారులోని పొలాల వద్దకు వస్తున్నాయి. కొన్ని గ్రామాల్లోకే వస్తున్నాయి. ఈ క్రమంలో వాటిని పసిగట్టిన ఊరకుక్కలు దాడిచేసి చంపేస్తున్నాయి. ఇక వేటగాళ్లు కూడా నీటి తావుల వద్దకు వచ్చిన వన జీవులను హతమార్చి మాంసం విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

వన్యప్రాణుల మాంసానికి డిమాండ్..

చెన్నూర్ అటవీ రేంజ్ పరిధిలో జంతువుల సంతతి అధికం కావడంతో వేటగాళ్లు ఉచ్చులు ఏర్పాటు చేసి జంతువులను హతమారుస్తున్నారు. అటవీ జంతువుల మాంసానికి మంచి గిరాకీ ఉండటంతో వేటాగాళ్లు విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తున్నారు. కొందరు ఉచ్చులు ఏర్పాటు చేసి చంపేస్తున్నారు.

నీటి తొట్ల నిర్వహణను మరిచిన అటవీశాఖ..

ఇక కోటపల్లి అటవీ ప్రాంతంలో అటవీశాఖ నిర్మించిన నీటి తొట్ల నిర్వహణను అధికారులు విస్మరించారు. కోటపల్లి అటవీ ప్రాంతంలో నిర్మించిన నీటి గుంతలో నీళ్లు నింపేందుకు సోలార్ పంపుసెట్లు కూడా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇదొక్కటే జంతువుల దాహం తీరుస్తోంది. చెన్నూర్, నీల్వాయి, కోటపల్లి రేంజ్ పరిధిలో అటవీప్రాంతంలో నిర్మించిన నీటి తొట్టిల్లో నీళ్లు నింపడం లేదు. కోటపల్లి వద్ద ఏర్పాటు చేసిన సోలార్ పంపుసెట్లు కూడా సరిగా పని చేయడం లేదు. చెన్నూర్ రేంజ్ పరిధిలోనే కుంటలు, సాసర్‌పిట్లు ఎక్కువ ఏర్పాటు చేశామని అధికారులు చెప్తున్నా నిర్వహణ సరిగా లేక వన్యప్రాణుల గొంతెండుతోంది. చివరకు ప్రాణాలే కోల్పోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా అటవీ అధికారులు స్పందించి నీటి తొట్లు నిర్మించాలని, ఇప్పటికే ఇర్మించిన వాటిలో నీరు ఉండేలా చూసుకోవాలని కోరుతున్నారు.

గతంలో జరిగిన సంఘటనలు...

- మండలంలోని మల్లంపేట గ్రామంలో చుక్కల దుప్పి సమీపంలోని చెరువులో నీరు తాగడానికి రాగా అక్కడే ఉన్న ఊర కుక్కలు వెంటపడి గాయపర్చడంతో గ్రామస్తులు అధికారులకు సమాచారం ఇచ్చారు.
- లింగన్నపేట గ్రామానికి సమీపంలోని అటవీప్రాంతంలో నీటి వనరులు సక్రమంగా లేకపోవడంతో తరుచూ వన్యప్రాణులు గ్రామ సమీపంలోకి వస్తున్నాయి. కుక్కలు తరుమడంతో తీవ్రంగా గాయపడుతున్నాయి.
- నక్కలపల్లి, పంగిడిసోమారం గ్రామంలో దప్పిక తీర్చుకోవడం కోసం గ్రామ సమీపంలోకి వచ్చిన వన్యప్రాణులను కుక్కలు గాయపర్చాయి. గ్రామస్తులే వాటిని పట్టుకున్నారు.

వన్యప్రాణులను సంరక్షిస్తాం..

వన్యప్రాణుల సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నాం. అడవుల్లో జంతువులకు కావాల్సిన నీటి సౌకర్యం కల్పిస్తున్నాం. ఆవాసాలు ఏర్పాటు చేస్తున్నాం. వన్య ప్రాణులను వేటాడేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. – రవి, ఫారెస్టు రేంజర్

క్లుప్తంగా

కిరాణ షాపులో చోరీ

నెన్నెల(బెల్లంపల్లి): మండలంలోని కోనంపేటలో దుర్గం రాజారాంకు చెందిన కిరాణ షాపులో శనివారం రాత్రి దొంగలు పడ్డారు. కిటికీ గ్రిల్స్ తొలగించి లోనికి ప్రవేశించిన దుండగులు బీరువాలో ఉన్న రూ.30 వేల నగదు, తులంన్నర బంగారం, మొబైల్ దొంగిలించుకు పోయారు. ఆదివారం ఉదయం రాజారాం లేచి చూసేసరికి షాపు కిటికి గ్రిల్స్ తొలగించి ఉండడం చూసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్, నెన్నెల ఎస్సై కుందారపు ప్రసాద్ డాగ్‌స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ టీంతో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసు నమోదు చేశామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు.

దారి మూసివేసిన పోలీసులు



దారి మూయక ముందు ఇలా

సాక్షి ఎఫెక్ట్..



దారి మూసి వేసిన తర్వాత ఇలా

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో గాంధీ పార్క్ సమీపంలో మైసమ్మ గుడికి వెళ్లే రహదారిని పోలీసులు మూసి వేశారు. ఈ నెల 5న 'దారి మూసి వేయాలి' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి డీసీపీ అశోక్ కుమార్ స్పందించారు. గాంధీ పార్క్ వద్ద నుంచి రైల్వే స్టేషన్ వైపు వెళ్లకుండా రెండు షటర్ల మధ్యన పెద్దపెద్ద బండలు, మట్టితో నింపి దారిని మూసివేశారు. ఈ దారిగుండా వెళ్లే వారిని మైసమ్మ గుడి వద్ద దొంగలు దోచుకునే వారు. వరుస ఘటనలు చోటు చేసుకోవడంతో అధికారులు స్పందించారు. దా రిని ఇటుకలతో మూసివేస్తే బాగుండేదని పట్ట ణ వాసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత


కాగజ్‌నగర్‌రూరల్: ఎస్పీఎం అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని జీఎం గిరి, సీనియర్ మేనేజర్ రమేశ్ రావు అన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని ఎస్పీఎం క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లారీ యాజమానుల 13 డిమాండ్లలో 10 పరిష్కారమైనట్లు తెలిపారు. పలుమార్లు జిల్లా కలెక్టర్, ఆర్డీవో ఆధ్వర్యంలో ఇరుపక్షాలు కూర్చుని చర్చించినట్లు తెలిపారు. కంపెనీ నష్టాల్లోకి వెళ్లకుండా మార్కెటింగ్ రంగాలపై అధ్యయనం చేసి లారీ యాజమానుల డిమాండ్లను పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. పంతాలకు పోకుండా తమకు సహకరించాలన్నారు. అధికారులు, లారీ అసోసియేషన్, యాజమాన్యం ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం సానుకూలంగా ఉందన్నారు. సాధ్యంకాని డిమాండ్లను అమలు చేయాలంటూ భయాభ్రాంతాలకు గురిచేయడం, మిల్లు ఉత్పత్తికి ఆటంకం, లారీలపై దాడులు చేయడం సరికాదన్నారు. మిల్లు అభివృద్ధి, కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని పనిచేయాలన్నారు. మార్కెట్లో పోటీని తట్టుకుని కార్మికులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు.

ఉపాధ్యాయ ఉద్యోగార్థులపై ఫీజుల భారం!

నిర్మల్ జిల్లా కేంద్రంలోని విజయ్‌నగర్ కాలనీకి చెందిన రమేశ్ డీఎడ్, బీఎడ్ శిక్షణ పూర్తి చేసుకుని నాలుగేళ్లుగా ఉపాధ్యాయ ఉద్యోగానికి ప్రిపేరవుతున్నాడు. ఇటీవల డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలై దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఇదే తరుణంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రకటన కూడా విడుదలైంది. దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఇతను ప్రైవేటు ఉద్యోగం మానేసి పూర్తి స్థాయిలో ఉద్యోగం కోసం సన్నద్ధమవుతున్న దశలో దరఖాస్తుల కోసం వేలాది రూపాయలు వెచ్చించాల్సి రావడం పెనుభారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇది ఇతనొక్కడి పరిస్థితే కాదు. ఉమ్మడి జిల్లాలోని 35 వేల మంది పరిస్థితి ఇంతే..



పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు



టెట్ ఫీజు రూ.వెయ్యిగా నిర్ణయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్

- టెట్ ఒక్కో పేపర్‌కు వెయ్యి రూపాయలు
- డీఎస్సీకి మరో వెయ్యి...
- తగ్గించాలని కోరుతున్న అభ్యర్థులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 35 వేల మంది..

నిర్మల్‌ఖిల్లా: దాదాపు ఏడేళ్ల తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం టెట్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. డీఎస్సీ దరఖాస్తుల ప్రక్రియ కూడా ప్రారంభమైంది. అయితే పరీక్ష ఫీజు ఒక్కో పేపర్ కు రూ.వెయ్యి నిర్ణయించడంపై అభ్యర్థులు మండిపడుతున్నారు. జిల్లా యూనిట్‌గా నియమితులయ్యే ఉపాధ్యాయ ఉద్యోగం కోసం కొన్నేళ్లుగా తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రైవేటు రంగాల్లో ఉపాధి, ఉద్యోగావకాశాలు మానుకుని గ్రంథాలయాల్లో సన్నద్ధమవుతుండగా దరఖాస్తు ఫీజులు పెనుభారంగా మారాయని అభ్యర్థులు వాపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కువ మంది అభ్యర్థులు పేద దిగువ మధ్యతరగతి కుటుంబాల వారే ఉన్నారు. బీఎడ్, డీఎడ్ శిక్షణ పూర్తి చేసుకుని ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో డీఎస్సీ టెట్ పరీక్షల ఫీజు తగ్గించాలని బీఎడ్, డీఎడ్ అభ్యర్థుల సంఘం నాయకులు ఆనంద్‌బాబు, తిరుమలేశ్, గజేందర్, ఎజాస్, తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రకటన విడుదల చేశారు.

డీఎస్సీలో ఒక్కో పరీక్షకు రూ.వెయ్యి

డీఎస్సీలో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ వివిధ సబ్జెక్టుల్లో పరీక్షలు ఉంటాయి. ఒక్కో అభ్యర్థి డీఎడ్, బీఎడ్ పూర్తి చేసిన వారు ఉన్నారు. ఎస్జీటీ పరీక్షకు రూ.వెయ్యి, స్కూల్ అసిస్టెంట్ ఒక్కో సబ్జెక్టుకు రూ.వెయ్యి ఉండడంతో ఒక్కో అభ్యర్థి దాదాపు రెండు నుండి మూడు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. దీంతో దరఖాస్తు చేసుకోవడానికి దాదాపు రూ.3 వేలకు పైగా ఖర్చు అవుతుందని వాపోతున్నారు. ఇప్పటికే కొన్నేళ్లుగా ప్రైవేటు ఉద్యోగాలు వదిలేసి గ్రంథాలయాలకే పరిమితమవుతూ పరీక్షలకు సన్నద్ధమవుతున్న సందర్భంలో ఈ పరీక్ష ఫీజులు భారీగా పెంచడంపై అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్ పరీక్షల హాజరూ భారమే...

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్), ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ)లను ఇకనుంచి ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో ఈ పరీక్షలు ఆఫ్‌లైన్‌లో ఆయా జిల్లా కేంద్రాల్లోనే నిర్వహించేవారు. కానీ ప్రస్తుతం ఈ పరీక్షలు రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, జిల్లా కేంద్రాల్లో నిర్వహించాల్సి ఉంటుంది. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, తదితర సుదూర ప్రాంతాలకు జిల్లా అభ్యర్థులు వెళ్లి పరీక్ష రాయాల్సి ఉంటుంది. దూరభారంతో అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావడానికి కూడా ప్రయాణ ఖర్చులు తడిసి మోపెడు కానున్నాయి.

టెట్‌కూ అంతే...

రాష్ట్ర ప్రభుత్వం టెట్ పరీక్షకు సంబంధించిన సమగ్ర నోటిఫికేషన్‌ను శుక్రవారం విడుదల చేసింది. ఈ మేరకు ఆన్‌లైన్‌లో అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించింది. ఇటీవల డీఎడ్, బీఎడ్ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులతో పాటు గతంలో టెట్ అర్హత సాధించి ఎక్కువ మార్కుల కోసం పరీక్ష రాయాలనుకునే అభ్యర్థులు మళ్లీ ఈసారి కూడా టెట్ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ దరఖాస్తుల ప్రక్రియ ఈనెల 27 నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభం కానుంది. గతంలో టెట్ పరీక్షకు ఒక పేపర్‌కు రూ.200, రెండు పేపర్లకు రూ.300 ఫీజుగా ఉండేది. ఈసారి ఈ ఫీజులను దాదాపు 80 శాతం పెంచారు. ఒక్క పేపర్‌కు రూ.వెయ్యి, రెండు పేపర్లకు రూ.2 వేలకు పెంచారు. నిరుద్యోగులకు పెనుభారంగా పరిణమించిన ఈ దరఖాస్తు ఫీజులను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

పునరాలోచన చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం టెట్, డీఎస్సీ పరీక్ష ఫీజులు వెంటనే తగ్గించాలి. టెట్, డీఎస్సీ పరీక్షలకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉండడంతో కేవలం దరఖాస్తులకే వేలాది రూపాయలు వెచ్చించాల్సి రావడం కష్టమవుతోంది. ఈ ఫీజులపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– సబ్బని మురళి, అభ్యర్థి, నిర్మల్

దరఖాస్తులకే రూ.5 వేలు



డీఎడ్, బీఎడ్ పూర్తి చేసిన నాలాంటి అభ్యర్థులకు టెట్ పేపర్ 1, పేపర్ 2 పరీక్షలకు కలిపి రూ.2 వేలు, డీఎస్సీలో ఎస్జీటీ కోసం రూ.వెయ్యి, స్కూల్ అసిస్టెంట్ సబ్జెక్టు, లాంగ్వేజ్ కలిపి రూ.2 వేలు మొత్తం రూ.5వేల వరకు దాదాపు దరఖాస్తులకే అవుతోంది.

– తక్కలపల్లి సునీల్‌కుమార్, అభ్యర్థి, నిర్మల్

ఎన్నికల కోడే ఆటంకమా?

- వేంపల్లిలో మేకల సంత వేలంపై సందిగ్ధం
- తరలిపోతుందేమోనని అనుమానం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లిలోని మేకల సంతకు జిల్లాలోనే చాలా పేరుంది. మేకల సంత ద్వారా గ్రామ పంచాయతీకి ఏటా దాదాపు రూ.40 లక్షలకు మించి ఆదాయం వస్తోంది. అలాంటి మేకల సంత నిర్వహణ ఈ నెలతో ముగియనుండగా ఎన్నికల కోడ్ కారణంగా వేలం పాటపై సందిగ్ధం కొనసాగుతోంది. గతేడాది నిర్వహించిన వేలం పాటలో పంచాయతీకి రూ.45 లక్షల 20 వేల ఆదాయం సమకూరింది. ఈ మార్చి 31లోగా మేకల నిర్వహణ గడువు ముగియనుంది. దీంతో ముందస్తుగా మేకల సంత నిర్వహణకు గానూ 21వ తేదీ గురువారం బహిరంగ వేలం వేయాలని పంచాయతీ ప్రత్యేక అధికారి హరిత, కార్యదర్శి ప్రతిభ ప్రకటన చేశారు. అయితే పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో మేకల సంత నిర్వహించరాదని అధికారుల సూచనతో బుధవారం మేకల సంత నిర్వహణ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఏటా రూ.లక్షల్లో ఆదాయం వచ్చే వనరును దూరం చేసుకుంటున్నట్లు అధికారుల తీరుతో తేటతెల్లమవుతోంది. ఎలాంటి అవగాహన లేకపోవడం, సరైన విధంగా సమాచారం లేకుండా కేవలం ఎన్నికల కోడ్ పేరుతో మేకల సంత వేలం వాయిదా వేశారని స్థానికులు, సంత నిర్వాహకులు మండి పడుతున్నారు. ఎన్నికల కోడ్ జూన్ 4 వరకు అమలులో ఉన్నట్లు తెలుస్తుండగా అప్పటి వరకు మేకల సంత వేలం నిర్వహించకుంటే పంచాయతీ ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని అంటున్నారు. కాగా ఈ విషయమై డీపీవో వెంకటేశ్వర్ రావును వివరణ కోరగా మేకల సంత పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించడమా? లేదా వేలం నిర్వహించడమా? అనే అంశంపై ఉన్నతాధికారులతో పాటు ఎన్నికల సంఘానికి నివేదించామన్నారు. ఏది ఏమైనా మేకల సంత వేలం నిర్వహించి పంచాయతీ ఆదాయానికి గండిపడకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

మంచిర్యాలలో వైభవ్ జ్యూయలర్స్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైభవ్ సంస్థల సీఎండీ భారత మల్లికా రత్నకుమారి గ్రంథి

- ప్రారంభించిన సీఎండీ భారత మల్లికా రత్నకుమారి గ్రంథి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా ఏర్పాటు చేసిన వైభవ్ జ్యూయలర్స్‌ను ఆదివారం ఆ సంస్థ సీఎండీ భారత మల్లికా రత్నకుమారి గ్రంథి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖపట్నం, గోపాలపట్నం, అనకాపల్లి, కాకినాడ, రాజమహేంద్రవరం, తుని, పార్వతీపురం, బొబ్బిలి, శ్రీకాకుళం, విజయనగరం, రాజాం, దిల్‌షుక్‌నగర్, ఏఎస్‌రావు నగర్, హైదరాబాద్‌లలో తమ బ్రాంచీలు ఏర్పాటు చేశామన్నారు. ఉత్తమ నాణ్యత, అనువైన ధరలు, విభిన్న డిజైన్లలో బంగారు ఆభరణాలు, వజ్రాభరణాలు, ప్లాటినం, రత్నాలు, వెండి ఆభరణాలు, పూజా వస్తువులతో అసంఖ్యాక ఆభరణాల శ్రేణి కలిగి, అసాధారణ అమ్మకాలతో కస్టమర్ల ఆమోదం పొందిందన్నారు. మంచిర్యాలలో 15వ షోరూంను ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రారంభోత్సవ కానుకగా సాధారణ బంగారు ఆభరణాలపై తరుగు కేవలం 9 శాతం, స్టోన్ స్టడెడ్, ఏంటిక్ జ్యువెల్లరీపై గ్రాముకు రూ.150 వరకు తగ్గింపు, వీవీఎస్ ఈఎఫ్ నాణ్యత గల డైమండ్‌లు ప్రత్యేక ధర క్యారెట్‌కు రూ.60 వేలు, సాధారణ వెండి వస్తువులను తయారీ చార్జీలు లేకుండా అందిస్తున్నామన్నారు. ×మన మంచిర్యాల గురించి తెలుసుకుందాం× కాంటెస్టు డ్రాలో గెలుపొందిన 10 మందికి ఒక్కొక్కరికి విజేతలు ఒక్కొక్కరికి 1 గ్రాము (22 క్యారెట్ బంగారు కాయిన్)లను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వోదయ నర్సింగ్‌హోం డాక్టర్ విష్ణువర్ధన్‌రావు, కెమిస్టు, డ్రగ్గిస్టు అసోసియేషన్ అధ్యక్షులు తొగరు సుధాకర్, వెంకటేశ్వర షాపింగ్‌మాల్ ఎండి నల్లా వెంకటనారాయణ, అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ ప్రైవేటు లిమిటెడ్ ఎండీ గుర్రాల శ్రీధర్, జ్యూయలర్స్ సీవోవో గొంట్ల రాఘాల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింధూరి వెంకటేశ్, ఎండీ అమరేంద్ర గ్రంథి పాల్గొన్నారు.

బాసరలో మంత్రి సీతక్క పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి సీతక్క

భైంసా: బాసర సరస్వతి అమ్మవారిని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి మాజీ ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి, నారాయణ్‌రావుపాటిల్ స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అతకుముందు బాసరలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సీతక్క సమావేశం నిర్వహించారు. మంత్రివెంట ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, నాయకులు ఉన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జైపూర్(చెన్నూర్): తమ సమస్యలు పరిష్కరించాలని శ్రీరాంపూర్‌లోని డివిజన్‌లో ఆయా డిపార్టుమెంట్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు శనివారం రాత్రి మినిమం వేజెస్ కార్పొరేషన్ బోర్డు చైర్మన్ బి.జనక్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. రసూల్‌పల్లిలోని ఆయన నివాసంలో జనక్‌ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారిందని, ఇచ్చే జీతాలను సైతం కొంతమంది కాంట్రాక్టర్లు సమయానికి ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. పీఎఫ్ కట్టకుండా పని చేయించుకుంటున్నారని, ప్రమాదానికి గురైతే బాధిత కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. స్పందించిన జనక్‌ప్రసాద్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, జాతీయ సమితి సభ్యుడు సీహెచ్ భీంరావు, కేంద్రకమిటీ నాయకులు గరిగే స్వామి, కలవేన శ్యామ్, పేరం రమేశ్, కాంట్రాక్టు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కోడ్ కూసినా కానరాని నిబంధనలు

- గ్రామాల్లో విచ్చల విడిగా బెల్టుషాపులు
- అర్ధరాత్రి వరకూ కొనసాగుతున్న దుకాణాలు
- 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు



ఓ గ్రామంలో బెల్టుషాపు వద్ద మందుబాబులు

జన్నారం(ఖానాపూర్): నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వహణపై దృష్టి సారించాలి.. మద్యం అమ్మకాలు లేని గ్రామంగా చూడాలి.. బెల్టుషాపుల రహిత నియోజకవర్గంగా తయారు చేయాలి.. ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలి.. ఇటీవల జరిగిన జన్నారం మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ కూసింది. కానీ మండలంలో కోడ్ నిబంధనలు అమలుకావడం లేదు. గ్రామాల్లో విచ్చల విడిగా వెలిసిన బెల్టుషాపుల్లో అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. యథేచ్ఛగా షాపులు నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు 'మామూలు'గా తీసుకుంటున్నారు. కొందరు మద్యం దుకాణాదారులు గ్రామాల్లోని బెల్టుషాపుల నిర్వాహకులను ప్రోత్సహిస్తూ మద్యం సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది.

100కు పైగానే..

జన్నారం మండలంలో 29 జీపీలున్నాయి. ఆయా పంచాయతీల పరిధిలో బెల్టుషాపులేని గ్రామం లేదు. ఒక్కో గ్రామంలో 4 నుంచి 6 వరకు బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో పదికి పైగా బెల్టు షాపులున్నాయి. పగలు రాత్రి తేడా లేకుండా దుకాణాల్లో మద్యం అమ్ముతున్నారు. ఈ విషయంలో అధికారులు దృష్టి సారించకపోవడం గమనార్హం.

అమలుకాని ఎన్నికల నిబంధన

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ మార్చి 16 నుంచి కోడ్ అమల్లోకి తెచ్చింది. అనుమతి, ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లరాదు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించవద్దు, మద్యం అమ్మకాలు చేయవద్దు. కానీ ఈ నిబంధనలు తమకేం పట్టవన్నట్లు కొందరు గ్రామాల్లో యథేచ్ఛగా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. వందల సంఖ్యలో బెల్టుషాపులు నడిపిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నిబంధనలు పకడ్బందీగా అమలు చేసినా ప్రస్తుతం ఇంకా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టడంలో అధికారులు దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎన్నికల నిబంధనల ప్రకారం గ్రామాల్లో అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చర్యలు తీసుకుంటాం

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందువల్ల లక్సెట్టిపేట్ సర్కిల్ వ్యాప్తంగా బెల్టుదుకాణాలు లేకుండా చూస్తున్నాం. ఇప్పటి వరకు 90 శాతం షాపులు బంద్ చేయించాం. నడిపించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. బెల్టుషాపులు నడిపించవద్దని హెచ్చరికలు జారీ చేశాం.

– నర్సింహులు, సీఐ, ఎక్సైజ్ శాఖ

దోచుకోవడం..దాచుకోవడమే బీఆర్ఎస్ పాలన

- కేసీఆర్ అవినీతికి నిలువెత్తు నిదర్శనం 'కాళేశ్వరం'
- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్



మాట్లాడుతున్న కోదండరాం

ఖానాపూర్: దోచుకోవడం దాచుకోవడమే లక్ష్యంగా పదేళ్ల బీఆర్ఎస్ పాలన సాగిందని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. పట్టణంలోని జేకే ఫంక్షన్‌హాల్‌లో జిల్లా అధ్యక్షుడు తిలక్‌రావు అధ్యక్షతన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పార్లమెంట్ సన్నాహక సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ అవినీతికి నిలువెత్తు నిదర్శనంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులు నిలిచాయన్నారు. కేంద్రప్రభుత్వ గుర్తింపు పొందిన జాతీయస్థాయిలోని స్వతంత్ర సంస్థ ఆడిటింగ్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు ప్రణాళిక, అమలు సరిగాలేదని, నిధుల వినియోగం సక్రమంగా లేదని చెప్పిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన కంపెనీ నుంచి కేసీఆర్ అందినకాడికి దండుకున్నారని విమర్శించారు. అవసరానికంటే అదనంగా ఖర్చు చేసి పనులు చేపట్టారన్నారు. రాష్ట్రంలో ఎన్నో ప్రాజెక్టులు దశాబ్దాల క్రితం కట్టారని అవన్నీ నేటికి చెక్కు చెదరకుండా ఉన్నాయని కేసీఆర్ కట్టిన కాళేశ్వరం పనులు మాత్రం ఆదిలోనే పునాదులు కదులుతున్నాయన్నారు. కోట్లాడి తెచ్చిన రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలనతో అవినీతి పెరిగిపోయిందన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యం

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా టీజేఎస్ శ్రేణులు పనిచేయాలని కోదండరాం అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్ అభివృద్ధి చేసేలా ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలతోపాటు గిరిజన వర్సిటీ ఏర్పాటు చేసి పోడు భూములు, డీ 27, డీ28 కాలువల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. అంతకముందు నాయకులు కోదండరాంను సన్మానించారు. పార్టీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు సర్దార్ వినోద్, దుర్మ, గోనె శ్రీనివాస్, బెనహర్ సిరాజ్, రాజేశ్వర్‌రెడ్డి, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ లేకనే 'కడెం'కు ప్రమాదం

కడెం: కడెం ప్రాజెక్ట్ నిర్వహణను గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే ప్రమాదం నెలకొందని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. కడెం ప్రాజెక్టును ఆదివారం ఆయన సందర్శించారు. వరద గేట్ల మరమ్మతు పనులను పరిశీలించారు. రాష్ట్రంలో హైదరాబాద్ ఇంజినీర్లు మొదట కట్టిన ప్రాజెక్టుల్లో కడెం ఒకటన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణ ఏర్పడిన తర్వాత కడెంను పట్టించుకోకపోవడంతో డేంజర్ జోన్‌లోకి వెళ్లిందని వివరించారు. కడెం ప్రాజెక్ట్‌కు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా ఎగువన కుప్టి ప్రాజెక్టు నిర్మిస్తే ఆయకట్టును స్థిరీకరించవచ్చని పేర్కొన్నారు. ప్రాజెక్టు ఆధునికీకరణ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఆయన వెంట టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు తిలక్‌రావు ఉన్నారు.

మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలి

- హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలని హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో 1,700 మంది మహిళా ఉద్యోగులు పని చేస్తున్నారని, ఇటీవల వారిపై వేధింపులు పెరుగుతున్నాయన్నారు. మహిళా కార్మికులు పని చేసేచోట వారికి ప్రత్యేక మహిళా సూపర్‌వైజర్‌ను నియమించాలని, ఇటీవల కంపెనీ బదిలీల్లో పెట్టిన షరతులను ఉపసంహరించుకోవాలని, సెక్యూరిటీ సిబ్బందిని అవుట్ సోర్సింగ్ పద్ధతిలో కాకుండా కంపెనీ ఉద్యోగులను నియమించాలని డిమాండ్ చేశారు. కంపెనీలో గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ గెలిచినా ఎలాంటి ప్రయోజనంలేదని, టీబీజీకేఎస్ విధానాలనే వారు కొనసాగిస్తున్నారన్నారు. శ్రీరాంపూర్‌లో అక్రమంగా డెప్యూటేషన్‌పై పనిచేస్తున్న 29 మందిని తిరిగి పంపాలని, ఇందులో అవినీతి జరుగుతోందని ఆరోపించారు. సమావేశంలో ఆయూనియన్ అధికార ప్రతినిధి జీవన్ జోయల్, బ్రాంచి ఉపాధ్యక్షుడు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి, కేంద్ర నాయకులు గోళ్ల సత్యనారాయణ, నాయకులు గోషిక మల్లేశ్, మీస కొముర య్య, నామల శ్రీనివాస్, కంబాల నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.